'సింగభూపాలెం' అభివృద్ధికి రూ.8.50 కోట్లు

చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కూనంనేని, అధికారులు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు అభివృద్ధికి రూ. 8.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వం అందించిన లక్ష చేప పిల్లలను ఆయన శుక్రవారం ఈ చెరువులో వదిలారు. అనంతరం, సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ... కాకతీయుల కాలం నాటిదైన సింగభూపాలెం చెరువు ఆధారంగా వేలాది మంది రైతులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. సీతారామ సాగర్ నీటి ద్వారా ఈ ప్రాంతంలోని 2,000 ఎకరాలకు, నియోజకవర్గంలోని 25,000 ఎకరాలకు సాగు నీరు అదనంగా అందించేందుకు కృషి జరుగుతున్నదని అన్నారు. మత్స్య శాఖాధికారి ఖదీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ కూచిపూడి నాగరాజు, ఎంపీవో శ్రీనివాస్, ఏవో నర్మద, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలోఫర్, ఏఈ కార్తీక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న వరంగల్ విద్యుత్ శాఖాధికారి వేణుగోపాల చారి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: విద్యుత్ అధికారులు వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ జోన్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం ఇల్లెందు సబ్‌డివిజన్‌లోని ఏడీఏ కార్యాలయంలో విద్యుత్ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులతో విద్యుత్ అధికారులు, సిబ్బంది ఓర్పుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మహేందర్, టెక్నికల్ అధికారులు కె రమేష్, ఫైనాన్స్ మెంబర్ ఆర్ చరణ్‌దాస్, డీఈ రంగస్వామి, ఏఈలు రాము, రమేశ్, రవి, ఎస్ఏవో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రమాద ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

టేకులపల్లి, అక్టోబర్ 4: ఇటీవల తరచుగా ఎన్‌హెచ్ 930పీ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ఇల్లెందు నుంచి కొత్తగూడెం ప్రాంతాలను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ సురేశ్, ఆర్అండ్‌బీ ఏఈలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాతాలలో కాజన్ బోర్డ్స్, హాజర్డ్ బోర్డ్స్, స్పీడ్ లిమిట్ బోర్డ్స్, రోడ్‌సైడ్ షోల్డర్ లెవలింగ్, ప్యాచ్‌వర్క్స్, బుషెష్ క్లియరింగ్, రేడియం స్టడ్స్ వంటివి ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పోగుల సురేష్, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన వీరకుమారికి సన్మానం

వీరకుమారిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

గుండాల, అక్టోబర్ 4: మండలంలోని పడుగోనిగూడెం గ్రామపంచాయతీ పాలగూడెం గ్రామానికి చెందిన వజ్జ యర్రయ్య కుమార్తె వజ్జ వీరకుమారి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గుండాల నవచైతన్య యువజన సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం వీరకుమారిని ఆమె ఇంటి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద గిరిజన విద్యార్థిని మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది. వైద్య చదువులు పూర్తయ్యే వరకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇల్లందుల నర్సింహులు, గడ్డం లాలయ్య, యూత్ సభ్యులు ఆజాద్, అజ్జు, సంతోష్, సతీశ్, సునీల్, వినయ్, ప్రశాంత్, మహేశ్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ఓ బూటకం

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 4: సర్వాధికారాలను తన గుప్పెట్లో పెట్టుకోవటానికి కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల డ్రామాకు తెరలేపిందని, ఈ పక్రియ ఓ బూటకమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాంబాబు అధ్యక్షతన జరిగిన హమాలీ వర్కర్స్ శాఖ సభలో ఆయన మాట్లాడారు. ఒకే ప్రజా, ఒకే ఎన్నిక , ఒకే సంస్కృతి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలన్నీ బీజేపీ పాలకుల స్వలాభాపేక్షేనని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, మడిపల్లి వెంకటేశ్వరావు, ఖాసిం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలని

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

అల్లిపల్లిలో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

దమ్మపేట, అక్టోబర్ 4: ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అల్లిపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కొత్తగా పెళ్లయిన వారిని, జన్మించిన వారిని ఈ సర్వేలో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, నాయకులు కేవీ సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు, చిన్నశెట్టి యుగంధర్, ఎర్ర వసంతరావు, సాయిల నర్సింహారావు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో డిజిటల్ కార్డు సర్వే

ములకలపల్లి, అక్టోబర్4: ఫ్యామిటలీ డిజిటల్ కార్డ్ సర్వేలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని ముత్యాలంపాడు గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నాలుగు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం మూకమామిడి వద్ద నిర్మిస్తున్న ఏకవల్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పదిహేను రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట స్పెషలాఫీషర్ టీ సుమ, ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్ పుల్లారావు, ఆర్ఐ భద్రు, ఎంపీవో లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డ్ సర్వే ప్రారంభం

పాల్వంచ, సెప్టెంబర్ 4: ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని బొల్లోరుగూడెం పదవ వార్డులో డిజిటల్ కార్డ్ పైలెట్ ప్రాజెక్ట్ సర్వేను శుక్రవారం ప్రారంభించారు. స్థానికులతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు డిజిటల్ కార్డు దోహదపడుతుందని అన్నారు. ఆర్డీవో మధు, తహసీల్దార్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: మండలంలోని పూబెల్లి గ్రామంలో డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా అధికారులు ఇంటింటికెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఇంట్లో ఎంతమంది ఉన్నారు, స్త్రీలు ఎంతమంది, పురుషులు ఎంతమంది ఉన్నారనేది నమోదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ

భద్రాచలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

అశ్వారావుపేట టౌన్: మద్దిరావమ్మ గుడి సెంటర్‌లో..

ఇల్లెందు రూరల్: రామాలయంలో..

అశ్వారావుపేట టౌన్: వడ్డెర బజార్‌లో చిన్నారుల సందడి

భద్రాచలం, అక్టోబర్ 4: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మను నిర్వహించారు. మహిళా అధ్యాపకులు అందమైన బతుకమ్మలను తయారుచేసి ఒకచోట చేర్చి వాటి చుట్టూ ఆడిపాడారు. వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట, అక్టోబర్ 4: తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మహిళలు ఇళ్ళ వద్ద పూలతో బతుకమ్మను తయారు చేసి నెత్తిన ఎత్తుకుని యువతులు, మహిళలు ఆలయాల వద్ద బతుకమ్మలను ఒక చోటు ఉంచి నృత్యాలతో బతుకమ్మ ఆడుతున్నారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ, అక్టోబర్ 4: మండలంలోని తిప్పనపల్లి, చండ్రుగొండ, రావికంపాడు, మద్దుకూరు, దామరచర్ల, గుర్రంగూడెం, పోకలగూడెం, రావికంపాడు, తుంగారం, గానుగపాడు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల, ఆలయాల ప్రాంగణాలల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ పందిళ్లల్లో బతుకమ్మలను ఒక చోట ఉంచి ఆడిపాడుతున్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: మండలంలోని కరెంటాఫీస్ ఏరియాలోని రామాలయం గుడిలో మహిళలు బతుకమ్మను ఒకచోట చేర్చి ఆడిపాడారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మహిళలతో కలిసి ఆడిపాడారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, అక్టోబర్ 4: టేకులపల్లిలోని కోదండ రామాలయంలో ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు ఆఫీసర్ కేఎం తార ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, యశోద, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు గుండ నర్సింహారావు, మధు రెడ్డి, మంగీలాల్, ఇస్లావత్ రెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.

అనుమతి ఉన్న ర్యాంపుల నుంచి ఇసుక తీసుకెళ్లాలి: కలెక్టర్

కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 4: జిల్లాలో ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక ర్యాంప్‌ల నుంచే చలాన కట్టి తీసుకెళ్లాలని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను సందర్శించా రు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్లు, నార్లపాటి అశోక్ ఇసుకను తోలుకునేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. మండలంలో అక్రమంగా ఇసుకను కొందరు మాత్రమే తోలుకుంటున్నారని అడిగిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని, మండలంలోని గాడ్రాల ఇసుక ర్యాంప్‌ను ప్రభుత్వం ప్రారంభించి ప్రతి ఒక్కరూ తీసుకె ళ్లాలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను నార్లపాటి శ్రీనువాసరావు కోరారు. దీనికి కలెక్టర్ స్పంది స్తూ ఏ సమస్య ఉన్నా దరఖాస్తు ద్వారా తెలపాలని, అనుమతి ఉన్న ఇసుక ర్యాంప్‌ల నుంచి మాత్రమే తీసుకెళ్లాలన్నారు.

భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, అక్టోబర్ 4: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారుచేయిం చి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశా రు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

మైకులను ప్రారంభించిన ఆలయ ఈవో

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి దాతలు అందించిన రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన మైకులను ఆలయ ఈవో రమాదేవి శుక్రవారం ప్రారంభించారు. తొలుత అర్చకులు మైకుసెట్ వద్ద పూజలు చేసి, హారతులు ఇచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహాలచ్చమ్మ గుడిలో భక్తుల పూజలు

పూజల్లో పాల్గొన్న వనమా రాఘవేందర్‌రావు

పాల్వంచ, అక్టోబర్ 4: పాల్వం చ సంజయ్‌నగర్ శ్రీమహాలచ్చమ్మ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేందర్‌రావు దంపతులు కూడా పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ మడుంబై మురళి కృష్ణమాచార్యులు రాఘవేందర్‌రావును సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, సునీల్, బాలాజీ, కృష్ణారెడ్డి, లక్ష్మణ్‌రావు, కమలాకర్, గ్యాస్ రాము, రఘు, భూక్యా వీరన్న, బట్టు మంజుల, హరి, యాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి చెక్‌పోస్టు తనిఖీ చేసిన రాష్ట్ర గనులశాఖ ఎండీ

చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్

భద్రాచలం, అక్టోబర్ 4: భద్రాచలం వద్ద చెక్‌పోస్టును రాష్ట్ర గనులశాఖ ఎండీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు నిర్వహణ రిజిస్టర్‌ను పరిశీలించి ఇసుక రవాణాకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. నిత్యం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.

కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4: స్థానిక ప్రకాశం స్టేడియంలో సింగరేణి ఉద్యోగులకు ఏరియా స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను డీజీఎం (పర్సనల్) రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. బాల్ బ్యాడ్మింటన్‌లో ఏరియా జట్టుపై కార్పొరేట్ జట్టు గెలుపొందింది. కబడ్డీలో ఏరియా జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 22, 23 తేదీల్లో ఆర్జీ1లో జరిగే కంపెనీ స్థాయి పోటీల్లో ఈ విజేతలు పాల్గొంటారు. సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ (కార్పొరేట్ ఏరియా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, కార్మిక ప్రతినిధులు రమణమూర్తి, పీతాంబరరావు తదితరులు పాల్గొన్నారు.

'పది' నాణేలపై అపోహలొద్దు

చుంచుపల్లి, అక్టోబర్ 4: పది రూపాయల నాణేల చెల్లుబాటుపై అపోహలు పెట్టుకోవద్దని రుద్రంపూర్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సూరాడ ఈశ్వరరావు కోరారు. ఈ నాణేల చెల్లింపుపై ఆయన శుక్రవారం ఖాతాదారులతో మాట్లాడారు. ఈ నాణేలు చెల్లుబాటు అవుతాయన్న విషయాన్ని వ్యాపారులకు చెబుతున్నట్లు చెప్పారు. ఈ నాణేలను అన్ని బ్యాంకుల్లో తీసుకుంటారని చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణంతో ఫుడ్ కోర్టు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 4: మండలంలోని వేపలగడ్డ గ్రామస్తురాలైన డ్వాక్రా మహిళ సోయం జయలక్ష్మి, సుజాతనగర్‌లోని గ్రామీణ బ్యాంక్ వద్ద 'ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్టు'ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు. రూ.30కే భోజనం అందిస్తున్నారు. గోంగూర అన్నం, పుదీనా అన్నం, కొత్తిమీర అన్నం, లెమన్ రైస్, పులిహోర, పెరుగన్నం.. రూ.30కే అందిస్తున్నారు.

లక్ష్మీదేవిపల్లి కళాశాలలో 'ఫ్రెషర్స్ డే'

పాల్వంచ రూరల్, అక్టోబర్ 4: మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే జరిగింది. ముఖ్య అతిథి, జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అనవసర వ్యాపకాలను పక్కనపెట్టి, కేవలం చదువు పైనే దృష్టి సారించాలని కోరారు. విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. ప్రిన్సిపాల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులో టిప్పర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్య నరసరావు, వెంకటేశ్వరరావుకు డిమాండ్ నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డీ మోహన్‌రావు, నాయకులు నూనెశ్వర్ రావు, బానోత్ లాలు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గాయత్రీదేవీ అవతారంలో దుర్గాదేవి

అన్నపురెడ్డిపల్లి: పూజలు చేస్తున్న భక్తులు, అశ్వారావుపేట రూరల్: మామిళ్లవారిగూడెంలో, అశ్వారావుపేట: పూజలు చేస్తున్న భక్తులు

అశ్వారావుపేట/ అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్/అన్నపురెడ్డిపల్లి/ సారపాక/దుమ్ముగూడెం/చర్ల, అక్టోబర్ 4: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో అమ్మవారికి సుంగధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి 108 మంది సుమంగళిలచే కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సారపాక: బసప్ప క్యాంపులో.. పాల్వంచ రూరల్: దేవీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు, టేకులపల్లిలో..

యూసఫ్‌కు రేగా పరామర్శ

యూసఫ్‌ను పరామర్శిస్తున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 4: స్థానిక ఎక్సలెంట్ విద్యాసంస్థల అధినేత యూసఫ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, శ్రీను ఉన్నారు.

వన్యప్రాణి సంరక్షణ వారోత్సవ ర్యాలీ

పాల్వంచ, సెప్టెంబర్ 4: వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా పాల్వంచలోని వన్యప్రాణి సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రేంజర్లు కనకమ్మ, కిరణ్‌కుమార్, జశ్వంత్ ప్రసాద్, రేగళ్ల కవితామాధురి తదితరులు పాల్గొన్నారు.

సాహితికి సన్మానం

సాహితిని సత్కరిస్తున్న బీఎన్ఆర్

సారపాక, అక్టోబర్ 4: గాంధీనగర్ ప్రాంతానికి చెందిన సాహితి ఢిల్లీలోని గోయాంక యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్‌లో సీటు సాధించడంతో బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ శుక్రవారం అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

దమ్మపేట రూరల్, అక్టోబర్ 4: అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం వీరు ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీలో జరుగుతున్న ఎంఈఈ (మల్టిపల్ ఎఫెక్టివ్ ఎవాపరేషన్) పనులను పరిశీలించారు. రోజువారీగా ఫ్యాక్టరీకి వస్తున్న పామాయిల్ గెలలు, ఆయిల్ రికవరీ తదితర వివరాలను మేనేజర్ కల్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కోడలిని అత్తింటికి చేర్చిన మానవహక్కుల సంఘం మహిళలు

సారపాక, అక్టోబర్ 4: భర్త, అత్తింటి వేధింపుల కారణంగా ఓ మహిళ ఇటీవల ఇంటి ఎదుట ఆందోళన చేసిన ఘటన పాఠకులకు విధితమే. శుక్రవారం వేధింపులకు గురైన మహిళ లక్ష్మిపార్వతిని మానవహక్కుల సంఘం మహిళలు అత్తింటికి చేర్చారు. సారపాకలో వైఎస్ఆర్ కాలనీలో నివాసించే కోరంపల్లి కామేశ్వరరావు కొంతకాలంగా తన భార్య కోరంపల్లి లక్ష్మీపార్వతిని వేధింపులకు గురిచేస్తూ ఇంటి నుంచి బయటకు గెంటేయడంతో రెండు రోజుల క్రితం భర్త ఇంటి ఎదుట బైటాయించి ఆందోళన చేపట్టింది. దీనికి స్పందించిన మానవహక్కుల సంఘం భద్రాచలం నియోజకవర్గ చైర్మన్ చెట్టి జయమ్మ, జిల్లా చైర్‌పర్సన్ రాగం కుసుమ, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఎండీ షమీం బాధిత మహిళ లక్ష్మీపార్వతిని అత్తింటికి తీసుకువెళ్లారు. మరోసారి ఇలా వేధింపులకు పాల్పడితే తమకు చెప్పాలని, సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

యువకుడిపై దాడి

భద్రాచలం, అక్టోబర్ 4: యువకుడిపై దాడిచేసిన ఘటన భద్రాచలం పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... శాంతినగర్‌కు చెందిన మణికంఠను సారపాకకు చెందిన ఆకాష్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి భద్రాచలం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ లాడ్జి సమీపంలో అర్ధరాత్రి విచక్షణారహితంగా దాడిచేశారు. దాడిలో మణికంఠ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

పశువులు తరలిస్తున్న వాహనాలు సీజ్

అశ్వారావుపేట, అక్టోబర్ 4: అనుమతులు లేకుండా పశువులకు అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేసి కొందరు వ్యాపారులు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. స్థానిక సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎస్సై యయాతి రాజు వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువులు తరలిస్తున్న రెండు బొలేరా వాహనాలను గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి పశువులకు పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పశువులు తరలిస్తున్న కాకినాడ జిల్లాకు చెందిన అశోక్, దుర్గా ప్రసాద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుట్కాలు పట్టివేత

టేకులపల్లి, అక్టోబర్ 4: కిరాణా షాపులో ఉంచిన గుట్కాలను పోలీసులు పట్టుకున్న ఘటన టేకులపల్లిలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... విశ్వాసనీయ సమాచారం మేరకు శుక్రవారం టేకులపల్లిలోని బోడు రోడ్డు సెంటర్‌లో కిరణా షాపులో పోలీసులు తనిఖీ నిర్వహించగా గుట్కాలు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకుని, షాపు యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. వాటి విలువ రూ.18,600 ఉంటుందన్నారు.

సౌండ్ సిస్టమ్ సామాన్లు చోరీ

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: సౌండ్ సిస్టమ్ సామన్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితుడు గోగుల రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన గోగుల రామకృష్ణ ఆర్‌కే సౌండ్ సిస్టంను నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగ సుమారు రూ.70 వేలు విలువ కలిగిన డీజే సౌండ్ సిస్టమ్ పరికరాలను దొంగలించాడన్నారు. చుట్టూ పక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగ ముఖానికి గుడ్డ కట్టుకుని గోడ దూకినట్లు రికార్డులో నమోదైందన్నారు. రామకృష్ణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.